సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఉపాధికి లంగరు

అర్ధరాత్రి నుంచి వేట నిషేధం

మత్స్యసంపద పెరిగే సమయం కావడంతో.. చేపల వేటకు ప్రభుత్వం విరామం ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి వేట నిషేధం అమల్లోకి రావడంతో.. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు తమ బోట్లన్నింటినీ లంగరు వేసేశారు. జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ నిషేధం అమల్లో ఉంటుంది. వేటే జీవనాధారంగా బతుకుతున్న గంగపుత్రులకు.. కూటమి ప్రభుత్వం గతేడాది కూడా మత్స్యకార భరోసా అందివ్వకపోవడంతో.. ఈ రెండు నెలలు ఎలా గడపాలోననే ఆందోళనతో భారమంతా గంగమ్మతల్లిపై ఉంచేస్తున్నామంటున్నారు -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

భరోసా దక్కని బతుకులు 8లో



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, పార్టీ నేతలు

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తాం

రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు ● పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి

మద్దిలపాలెం: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో లేకుండా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం గొల్ల బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు. అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు ఒక్క పథకం కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉండటానికి కారణం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, పార్టీ ముఖ్య నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రవిరాజు, ఫరూఖి, జహీర్ అహ్మద్, నడింపల్లి కృష్ణంరాజు, మొల్లి అప్పారావు, అల్లంపల్లి రాజబాబు, జిల్లా అధికార ప్రతినిధులు మంచా మల్లేశ్వరి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, మారుతి ప్రసాద్, రాంరెడ్డి, సేనాపతి అప్పారావు, దేవరకొండ మార్కండేయులు, కొండారెడ్డి, పార్టీ నాయకుల మధుసంపతి, పత్తిపాడు వెంకటలక్ష్మి, పతివాడ కనకరాజు, వానపల్లి ఈశ్వరరావు, పెంట్ర అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్



రాజ్యాంగ నిర్మాత అందుకో నివాళి

ప్రేమించిన అమ్మాయి కోసం వైజాగ్ వచ్చేవాడిని

హిట్ 3 ట్రైలర్ రిలీజ్ వేడుకలో హీరో నాని



సీతమ్మధార: పెళ్లికి ముందు ఓ అమ్మాయిని కలిసేందుకు వైజాగ్ వచ్చేవాడిని.. అంటూ నేచురల్ స్టార్ నాని తన పర్సనల్ సీక్రెట్ బయటపెట్టారు. ఆయన లీడ్ రోల్‌లో దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన హిట్- 3 సినిమా ట్రైలర్‌ను నగరంలోని సంగం థియేటర్‌లో సోమవారం రిలీజ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాని సినిమాతో పాటు పలు విషయాలు పంచుకున్నారు. 'నా పెళ్లికి ముందు దాదాపు 15 ఏళ్ల క్రితం ఇక్కడికి ఓ అమ్మాయిని కలవడానికి వచ్చేవాడిని, తర్వాత ఆ అమ్మాయినే పెళ్లి చేసుకున్నాను. నాకు వైజాగ్‌తో స్పెషల్ బాండ్ ఏర్పడింది. అప్పుడైనా, ఇప్పుడైనా వైజాగ్‌కు వచ్చింది ప్రేమ కోసమే. వేరే ఎక్కడికి వెళ్లినా నన్ను వాళ్లు అన్న లేదా తమ్ముడిలా చూస్తారు. కానీ వైజాగ్ వచ్చినప్పుడు మాత్రం అల్లుడిలాగే చూస్తారు'.. అంటూ నాని తన భార్య గురించి, వైజాగ్‌తో ఉన్న అనుబంధాన్ని షేర్ చేసుకున్నారు. ఇక ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హిట్- 3 అనేది కొత్త జానర్. ఇందులో మనకు అలవాటు లేని కొత్త టోన్ ఉంటుంది. కొత్త ప్రయత్నాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారనడానికి వంద ఉదాహరణలు ఉన్నాయని, మే 1న మనమంతా గెలుస్తామన్న నమ్మకం ఉందన్నారు. అనంతరం సినిమాలో డైలాగ్‌తో నాని అభిమానులను అలరించారు.

షిప్‌యార్డు కార్మికులకు ప్రమాద బీమా

సాక్షి, విశాఖపట్నం: హిందూస్థాన్ షిప్‌యార్డులో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, అప్రెంటిస్, ట్రైనీల ఆరోగ్యంపై ప్రధాన దృష్టి సారిస్తున్నామని షిప్‌యార్డ్ సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రీ తెలిపారు. వీరందరి సంక్షేమం కోసం ప్రమాద బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. న్యూ ఇండియా అస్యూరెన్స్ కో-లిమిటెడ్‌తో కలిసి సమగ్రమైన గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ బీమా పాలసీని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2,500 మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు, అప్రెంటిస్‌లు, ట్రైనీలకు ప్రమాద బీమా అందుబాటులోకి తీసుకొస్తున్నామని ప్రకటించారు. షిప్‌యార్డులో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆరోగ్య సంరక్షణ కోసం రూ.20 లక్షల విలువైన బీమా చేస్తున్నామన్నారు.

మెట్రోపై మొద్దు నిద్ర

డబ్బులెక్కడ



భూ సేకరణకు రూ.882 కోట్లు ఖర్చవుతుందని అంచనా

- రూపాయి విదల్చకుండా ప్రాజెక్టుపై మీనమేషాలు
- కనీసం సర్వేకి నిధులు అడిగినా స్పందించని ప్రభుత్వం
- సర్వే కోసం అదనపు సిబ్బందిని కేటాయించని వైనం



సాక్షి, విశాఖపట్నం: ఆర్థిక రాజధాని చేస్తామంటూ విశాఖపై ప్రేమ ఒలకబోస్తున్న కూటమి ప్రభుత్వం, కీలకమైన మెట్రో ప్రాజెక్టుపై మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బయటకు బాహాటంగా ప్రకటనలు చేస్తున్నా.. వైజాగ్ మెట్రో ప్రాజెక్టు విషయంలో సర్కారు మొద్దు నిద్ర నటిస్తోంది. ఓవైపు భూ సేకరణకు రంగం సిద్ధం చేసి.. సర్వే పనులు మొదలుపెట్టాలంటూ అధికారులను ఆదేశించిన ప్రభుత్వం.. అవసరమైన నిధులు, సిబ్బందిని అడిగితే మీనమేషాలు లెక్కిస్తోంది. భూసేకరణకు రూ.882 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. కానీ ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. పేపర్‌పై పరుగులు పెడుతున్న మెట్రో భూ సర్వే.. ప్రభుత్వ వైఖరితో అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో సర్వే ఎలా చేయాలన్న దానిపై జిల్లా అధికార యంత్రాంగం తర్జనభర్జన పడుతోంది.

మరోసారి సర్వేకు ఆదేశాలు.. కానీ..!

గతంలో చేసిన సర్వేలో 4 కారిడార్లలో మెట్రో స్టేషన్లు, 22 ఎట్ గ్రేడ్ పార్కింగ్‌లు, మల్టీలెవల్ పార్కింగ్ భవనాలు, రన్నింగ్ స్టేషన్లు, హనుమంతువాకలో మెయింటెనెన్స్ డిపో, ఇతర అవసరాలకు, పోర్టు భూమిలో ఆక్సిలరీ డిపో ఏర్పాటుకు 35.96 ఎకరాలు కలిపి మొత్తం 118.86 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఇందులో ప్రైవేట్ భూమి కేవలం 11.7 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి వస్తుందని.. మిగిలిన 106.66 ఎకరాలు ప్రభుత్వ భూమిని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. కానీ కూటమి ప్రభుత్వం మెట్రోని మరింత జాప్యం చేసేందుకు భూ సర్వే చేయాలంటూ జిల్లా అధికారులను ఆదేశించింది. తొలి విడతలో 46 కి.మీ మేర కారిడార్ నిర్మాణం చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం భూ సేకరణకు రూ.882 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేశారు. మెట్రో కోసం యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (యూఎంటీఏ)ని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల కోసం ఏర్పాటు చేసింది. దీని సహకారంతో సర్వే చేపట్టాలని ఆదేశించినా జిల్లా అధికారులు అడుగు ముందుకు వేయలేకపోతున్నారు.

స్పెషలిస్ట్ సర్వేయర్లు అవసరం లేదంట

మెట్రో రైలు ప్రాజెక్టు సర్వేకు స్పెషలిస్ట్ సర్వేయర్లు, సిబ్బంది అవసరమని జిల్లా అధికారులు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ ప్రభుత్వం మాత్రం జిల్లాలో ఉన్న సర్వేయర్లతోనే పనికానివ్వాలని ఆదేశించడం గమనార్హం. మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు కూడా ప్రభుత్వ వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పెషలిస్ట్ సిబ్బంది లేకుండా సర్వే సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. దీంతో నెల రోజులుగా సర్వేకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అదేవిధంగా భూ సేకరణకు రూ.882 కోట్ల వరకూ ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. కానీ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సేకరణ ఎలా సాధ్యమవుతుందంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం ప్రత్యేక సర్వేయర్లను నియమించుకునేందుకైనా నిధులు మంజూరు చేయాలని ఏపీఎంఆర్‌సీ కోరినా దానిపైనా స్పందన లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు. ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరి చూస్తే అసలు వైజాగ్ మెట్రోపై ప్రభుత్వానికి ఆసక్తి లేదన్నది స్పష్టమవుతోంది.

గత ప్రభుత్వం హయాంలో కీలక అడుగులు

విశాఖ మరింత అభివృద్ధి చెందేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తూ లైట్ మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసింది. 76 కిలోమీటర్ల మేర 4 కారిడార్లతో నిర్మించనున్న తొలి విడత ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు వ్యయం అవుతుందని స్పష్టం చేస్తూ.. 2023 డిసెంబర్ 29న ఉత్తర్వులు సైతం జారీ చేసింది. పీపీపీ విధానంలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టులో ప్రభుత్వాల వాటా 40 శాతం కాగా, టెండరు దక్కించుకున్న సంస్థ 60 శాతం భరించనున్నట్లు ఉత్తర్వుల్లో పొందుపరిచారు. 2024 జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ని కూడా పంపించారు. అయితే ప్రభుత్వం మారిపోవడంతో చంద్రబాబు మెట్రో ప్రాజెక్టుకు మోకాలడ్డే ప్రయత్నాలు మొదలుపెట్టేశారు. మరోసారి డీపీఆర్ తయారు చేస్తామంటూ పాత డీపీఆర్‌ని పక్కన పడేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. అయితే పాత డీపీఆర్‌కే స్వల్ప మార్పులు చేసి హడావుడి చేస్తూ ప్రాజెక్టుపై నిర్లక్ష్యంగానే కూటమి ప్రభుత్వ వ్యవహరిస్తోంది.

గతంలో చేసిన సర్వే ప్రకారం.. మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన భూమి వివరాలు

నాలుగు కారిడార్లకు అవసరమైన భూమి: 118.86 ఎకరాలు

	ప్రభుత్వ భూమి	ప్రైవేట్ భూమి
మొత్తం	106.66 ఎకరాలు	11.7 ఎకరాలు
కారిడార్-1కి అవసరమైన	78.94 ఎకరాలు	7.08 ఎకరాలు
కారిడార్-2కి అవసరమైన	1.36 ఎకరాలు	2.97 ఎకరాలు
కారిడార్-3కి అవసరమైన	7.41 ఎకరాలు	0.90 ఎకరాలు
కారిడార్-4కి అవసరమైన	18.95 ఎకరాలు	0.75 ఎకరాలు



యాదవ ఓట్లతో గెలిచి యాదవులకే వెన్నుపోటు

- ఆ ఇద్దరు యాదవ ఎమ్మెల్యేలు సొంత సామాజికవర్గంలో ముసలం సృష్టిస్తున్నారు
- యాదవ మేయర్‌ను దించేందుకు ప్రయత్నిస్తే జీరోలుగా మిగులుతారు
- యాదవ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు ఆల్సి అప్పలనారాయణ యాదవ్



మహారాణిపేట : యాదవ కులంలో ముసలం సృష్టించి, యాదవ వర్గానికి చెందిన గొలగాని హరి వెంకట కుమారిని జీవీఎంసీ మేయర్ పీఠం నుంచి దించేందుకు యాదవ ఎమ్మెల్యేలే ప్రయత్నించడం దౌర్భాగ్యమని యాదవ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ నేత ఆల్సి అప్పలనారాయణ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు ఎన్నికల్లో గెలిచే వరకు కులం కావాల్సి వచ్చిందని, గెలిచాక అదే కులాన్ని దెబ్బతీస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఓ వీడియోలో ఆక్షేపించారు. వీరి తీరును యాదవులు, విశాఖ ప్రజలు ఛీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. మూడు సార్లు పోటీ చేసి ఓడిపోయి ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి, యాదవుల్లో చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ స్థిరత్వం కోసం యాదవులను పావులుగా ఉపయోగించుకుంటున్న ఇద్దరు ఎమ్మెల్యేలు భవిష్యత్తులో ఎందుకూ పనికి రాకుండా పోతారని, యాదవ జాతి వీరిని క్షమించదన్నారు. యాదవ వర్గానికి చెందిన మేయర్‌ను దించేందుకు బెహరా భాస్కరరావు, ముత్తంశెట్టి పద్మ తదితరులను వాడుకుంటున్నారని, ఇలాంటి పనులు చేస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కేవలం 8 నెలల పదవి కోసం రాజకీయం చేస్తున్న ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు యాదవ కులాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. యాదవ కులాన్ని దెబ్బతీసేలా రాజకీయం చేయడం తగదని హితవుపలికారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్‌ను గద్దె దించితే.. ఆ స్థానంలో మరో యాదవ సామాజిక వర్గానికి చెందిన వారినే కూర్చోబెట్టాలని డిమాండ్ చేశారు.

మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీగా చంద్రశేఖరరెడ్డి

మహారాణిపేట: మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్(ఇన్‌చార్జి)గా ఎ.చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జేడీ పి.లక్ష్మణరావు 20 రోజుల పాటు కొరియాలో శిక్షణ నిమిత్తం వెళ్లారు.

క్షణక్షణం.. భయంభయం

- అనకాపల్లి జిల్లాలో రెట్టింపు సంఖ్యలో గుర్తింపులేని ఫైర్ క్రాకర్స్ యూనిట్లు
- ఇప్పటికే ఫార్మా ప్రమాదాలతో ఉక్కిరిబిక్కిరి
- ఇప్పుడు బాణసంచా పేలుడుతో మరింత ఆందోళన

ఊహించని ఉత్పాతం జరిగింది.. ఉపాధి ఉసురు తీసింది.. అవలీలగా బాణసంచా తయారు చేసే వారంతా.. దానికే బలైపోయారు. ఘటన జరిగి 40 గంటలు గడుస్తున్నా.. ఆ శబ్దం ఇంకా చుట్టుపక్కల ప్రాంతాల్ని భయపెడుతూనే ఉంది. బాణసంచాకు ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లాలో అనేక చోట్ల ఈ తరహా కేంద్రాలున్నాయి. కైలాసపట్నం ఘటనతో ఆయా ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. తమ ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రాణాలు గుప్పెట పెట్టుకొని జీవిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఉలికిపాటు నటించే జిల్లా అధికార యంత్రాంగం.. ఆ తర్వాత ఏమరుపాటుగా వ్యవహరిస్తుండటంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఓవైపు వరుసగా జరుగుతున్న ఫార్మా ప్రమాదాలు అనకాపల్లి జిల్లాని ఆందోళనకు గురిచేస్తుండగా.. ఇప్పుడు బాణసంచా ప్రమాదం.. మరింత వణికిస్తోంది.



సాక్షి, విశాఖపట్నం: మందుగుండు సామగ్రికి అనకాపల్లి జిల్లా ఎంతో ప్రసిద్ధి. పెళ్లిళ్లు, అమ్మవారి పండగలు, ఇతర ఉత్సవాలకు బ్రాండెడ్ సంస్థలు బాణసంచాను అందించలేవు. అందుకే.. లోకల్‌గా ఉన్న తయారీ కేంద్రాలపై ఆధారపడుతుంటారు. ఇక్కడ జనం కోరిన విధంగా బాణసంచా తయారుచేస్తారు. పేల్చినప్పుడు ఏ రంగు రావాలి, ఎలాంటి సౌండ్ రావాలి, ఎలా దూసుకెళ్లాలి.. ఇలాంటి స్పెషల్ క్రాకర్స్ రూపొందిస్తారు. ఒక దుకాణంలో పనిచెయ్యడం.. అక్కడ ఎలా తయారు చేస్తున్నారో అవగాహన పెంచుకొని.. వేరే చోట తయారీ కేంద్రం పెట్టడం.. ఇలా జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ఉమ్మడి విశాఖతోపాటు తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాలోని ప్రాంతాలవారికీ అనకాపల్లి నుంచే బాణసంచా సరఫరా చేస్తారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. మొత్తం 40 కేంద్రాలున్నట్టు అంచనా. కానీ.. ఇందులో లైసెన్సులు తీసుకొని నడుపుతున్నవి మాత్రం 21 మాత్రమే. మిగిలిన 19 దుకాణాలకు లైసెన్స్ లేదని తెలిసినా.. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కారణం.. నెలనెలా వసూళ్ల పర్వం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 40 దుకాణాలున్నాయని చెబుతున్నప్పటికీ.. మరో 20 వరకూ తయారీ కేంద్రాలను గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్నారని తెలుస్తోంది. వీటి విషయంలోనూ ఎలాంటి తనిఖీలు చేపట్టడం లేదు.

కనీస పరిశీలనలు శూన్యం.!

దరఖాస్తు వచ్చిందా.. లైసెన్స్ ఇచ్చేశామా.. వదిలేశామా.. అనే రీతిలోనే బాణసంచా తయారీ దుకాణాల విషయంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఆ దుకాణంలో ఏం తయారు చేస్తున్నారు.? మోతాదుకు మించిన నిల్వలున్నాయా.? గోదాముల పరిస్థితేంటి అనేది పట్టించుకున్న పాపానపోలేదు. అంతేకాదు.. లైసెన్స్‌లు మంజూరు చెయ్యాలని కొందరు దుకాణదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్ని పెండింగ్‌లో ఉంచారే తప్ప.. ఆ దుకాణాల దగ్గరకు వెళ్లి.. వాటిని పరిశీలించిన దాఖలాలూ కనిపించడం లేదు.

ఇక్కడ తయారీ కేంద్రాల పరిస్థితేంటో?

కైలాసపట్నంలో ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు అప్రమత్తత నటిస్తూ హడావిడి చెయ్యడం మొదలు పెట్టారు. జిల్లాలోని అన్ని తయారీ కేంద్రాల్ని పరిశీలించేందుకు బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా ప్రకటించారు. ఏవైనా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంటే వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రమాదం జరిగిన విషయం దావానలంలా వ్యాపించడంతో.. మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా బిక్కుబిక్కుమంటున్నారు. రాంబిల్లి, దేవరాపల్లి, నక్కపల్లి, అనకాపల్లి మండలాల్లో ఈ తరహా తయారీ కేంద్రాలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు తమ వద్ద ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇప్పటికే ఫార్మా పరిశ్రమల్లో నెలకో ప్రమాదం సంభవిస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. తాజాగా.. బాణసంచా ప్రమాదం మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

నిబంధనలు బేఖాతర్

బాణసంచా తయారీ కేంద్రాల నిర్వహణకు కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, ఫైర్, పోలీస్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పేలుడు పదార్థాల చట్టం 1908 ఎక్స్‌ప్లోజివ్ చట్టం ప్రకారం నిర్దిష్ట ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. భారీ పేలుడు సంభవించేందుకు ఆస్కారమున్న పదార్థాలను ప్రత్యేకంగా నిల్వ ఉంచాలి. తయారీదారులు ఫైర్ ఫైటింగ్ విషయాల్లో శిక్షణ తీసుకోవాలి. బాణసంచా దుకాణం వద్ద తయారీ ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. నాలుగు ఫైర్ సిలిండర్లు, నాలుగు బకెట్లు, నిమిషానికి 450 లీటర్ల కెపాసిటీ గల ఒక డీజిల్ పంపు, 25 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకు ఉండాలి. అనుమతులకు మించి బాణసంచా సరుకులను తయారు చేయకూడదు. పరికరాలను ఉపయోగించేందుకు నలుగురు ఆపరేటర్లు ఉండాలి. కేంద్రం చుట్టూ రక్షణను ఏర్పాటు చేయాలి. తయారీ కేంద్రం దృఢంగా సిమెంటుతో నిర్మించాలి. తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా లాభార్జనే ప్రధానంగా వ్యవహరించడం ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

భర్తే కాలయముడు

- తొమ్మిది నెలల గర్భిణి దారుణ హత్య
- మధురవాడలో దారుణ ఘటన






ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తే కాలయముడుగా మారాడు. నిండు చూలాలైన భార్యను పీక నులిమి చంపేశాడు. ఈ ఘటన మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ ఆర్టీసీ డిపో సమీపంలో సోమవారం చోటుచేసుకుంది.

మెయిన్‌లో

ఇంటర్ ఫెయిల్‌కావడంతో విద్యార్థిని ఆత్మహత్య

ఫస్టియర్ పరీక్షలు రాసిన నిహారిక



భరోసా దక్కని బతుకులు

- అమల్లోకి వచ్చిన చేపల వేట నిషేధం
- 61 రోజులు విరామం
- ఒడ్డుకు చేరుకున్న 2,500 బోట్లు
- మత్స్యకార భరోసా హామీ నిలుపుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో మత్స్యకార కుటుంబాలు

మహారాణిపేట: మత్స్యకారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం అమలులోకి వస్తోంది. జూన్ 15 వరకు కొనసాగనుంది. మత్స్య సంపద ఉత్పత్తి అయ్యే సమయం కావడంతో ప్రతి ఏటా రెండు నెలలపాటు వేట నిషేధం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో సంపాదన లేక ఖాళీగా ఉండే గంగపుత్రుల జీవనానికి ప్రభుత్వం భృతి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందు రూ.2 వేల చొప్పున పరిహారం అందజేసేవారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎప్పుడో ఆరేడు నెలల తర్వాత భృతి మంజూరు చేసేది. అది కూడా స్థానికంగా పలుకుబడిన నాయకుల అనుచరులకు మాత్రమే ఇచ్చేవారు. పాదయాత్రలో గంగపుత్రుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వేట నిషేధ నష్టపరిహారం రూ.10 వేలకు పెంచడంతోపాటు ప్రతి ఏటా మే నెలాఖరుకు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఐదేళ్ల పాటు నిరాటంకంగా మత్స్యకార భరోసాను అమలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకార భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించాయి. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ఇవ్వాల్సిన భరోసా ఇంతవరకు అమలు చేయలేదు. అసలు ఎప్పుడిస్తారో కూడా చెప్పలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 34 తీరప్రాంతాల్ని ఆనుకుని మత్స్యకార గ్రామాలున్నాయి. వీటిలో లైసెన్స్ కలిగిన మెకనైజ్డ్ బోట్లు, ఇంజను బోట్లు, తెప్పలు, తెరచాపలతో సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు సుమారు 26 వేల మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేలు ఇవ్వకపోగా గత ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు కూడా ఇవ్వడం మానేసిందంటూ గంగపుత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గత ఏడాది నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


హార్బర్‌లో బోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా..

వేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలకు పూర్వం రూ.2 వేలు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసరాలకు ఫుల్‌స్టాప్ పెట్టి రూ.4 వేల చొప్పున భృతి ఇచ్చారు. అది కూడా వేట నిషేధం ముగిసిన తర్వాత ఆర్నెల్లకో ఏడాదికో ఎప్పుడిచ్చేది కూడా తెలిసేది కాదు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి నిషేధ కాలంలోనే పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇచ్చి వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకే కాకుండా.. తెప్పలు ఇతర సంప్రదాయ నావలపై వేట సాగించే వారికి సైతం ఈ సాయాన్ని వర్తింప జేసింది.

తీరానికి బోట్లు

జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం, 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 1.15 లక్షల మత్స్యకార కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి కోసం ఈ నిషేధం విధిస్తున్నట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇంజిన్, యాంత్రిక (మెకనైజ్డ్)బోట్లకు ఈ నిషేధం వర్తిస్తుందని, మత్స్యకారులు ప్రభుత్వానికి సహకరించాలని జేడీ చంద్రశేఖరరెడ్డి కోరారు. నిషేధం అమలులోకి రావడంతో దాదాపు 2,500 బోట్లు విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నాయి. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో వేట నిషేధం అమల్లో ఉంటుంది.

మత్స్యకారులు సహకరించాలి

ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు తూర్పు సముద్ర తీర ప్రాంతంలో వేట నిషేధం అమల్లో ఉంటుంది. ఈ రోజుల్లో మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి, నిర్వహణ దృష్ట్యా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తున్నాం. మత్స్యకారులంతా ప్రభుత్వానికి సహకరించాలి.

–చంద్రశేఖరరెడ్డి,
ఇన్‌చార్జీ జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

నాన్నా..నేను చనిపోతున్నా..!

- అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో
- బెట్టింగ్‌లకు అలవాటు పడి రూ.21 లక్షలు అప్పులు
- కాపాడిన పోలీసులు


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉద్యోగిని రక్షించిన పోలీసులు

కొమ్మాది: బెట్టింగులకు అలవాటు పడి అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉద్యోగిని పోలీసులు కాపాడిన సంఘటన భీమిలి బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక ప్రాంతానికి చెందిన కొండా సుందర్ (30), భార్య, కుమార్తెతో కలిసి పీఎంపాలెంలో నివాసం ఉంటున్నారు. రెండున్నరేళ్లుగా రుషికొండ ఐటీ సెజ్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో బెట్టింగులకు పాల్పడుతూ, అది కాస్తా వ్యసనంగా మారింది. బెట్టింగ్‌ల కారణంగా సుమారు రూ. 21 లక్షల అప్పు చేశాడు. స్నేహితుల ఖాతాలో బ్యాంకుల నుంచి కూడా అప్పులు తీసుకున్నాడు. అప్పులు తీర్చాల్సిందిగా.. ఒత్తిడి పెరిగింది. దీంతో మానసికంగా ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం విధులకు వెళ్తున్నానని చెప్పి బయల్దేరాడు. కాసేపటి తర్వాత 'నాన్నా నన్ను క్షమించు, నీకు ముఖం చూపించలేకపోతున్నా రూ. 21 లక్షలు అప్పు చేశాను. నేను ఎంత కష్టపడినా అప్పులు తీర్చలేని పరిస్థితి. నాభార్య, కుమార్తెను బాగా చూసుకోండి.. నేను చచ్చిపోతానంటూ..'ఓ సెల్ఫీ వీడియో తీసి తన తండ్రికి పంపించాడు. అది చూసిన తండ్రి వెంటనే 112కు కాల్ చేసి విషయం చెప్పి, ఆ వీడియోను పోలీసులకు పంపించారు. అతను పంపిన వీడియోలో.. తన కోసం వెతికితే బీచ్ రోడ్డులో ఫోన్ దొరుకుతుందని చెప్పడంతో.. ఆయన పంపిన వీడియోలో బ్యాక్‌గ్రౌండ్ ఆధారంగా పోలీసులు వెంటనే స్పందించి భీమిలి బీచ్ రోడ్డు రామానాయుడు ఫిల్మ్‌స్టూడియో సమీపంలో ఉన్న బీచ్‌కు చేరుకున్నారు. సుందర్ ఓ చెట్టు కింద కూర్చుని ఏడుస్తూ ఉన్నాడు. పీఎం పాలెం బీచ్ మొబైల్ పోలీసులు ఆయనను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసులు తెలుసుకుని సుందర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి అతి తక్కువ సమయంలో సుందర్‌ను గుర్తించి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని సీఐ బాలకృష్ణ అభినందించారు.

గల్లంతైన యువకులు మృతి

- సరియా జలపాతం నుంచి మృతదేహాలు వెలికితీత


సరియా జలపాతం నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం


మృతదేహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మాణిక్యం,సీఐ హిమగిరి

సాక్షి,పాడేరు: అనంతగిరి మండలం మారుమూల జీనబాడు పంచాయతీలోని సరియా జలపాతంలో గల్లంతైన విశాఖకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. యువకులు గల్లంతైనట్టు ఫిర్యాదు అందడంతో సోమవారం ఉదయం తహసీల్దార్ మాణిక్యం, అరకు సీఐ హిమగిరి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి సరియా జలపాతానికి చేరుకున్నారు. యువకుల ఆచూకీ కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలించింది. ఉదయం 10గంటల సమయంలో విశాఖపట్నంలోని పూర్ణామార్కెట్ వద్ద పండావీధికి చెందిన ఇళ్ల వాసు(21), రెల్లివీధిలోని ఏవీఎన్ కళాశాల ప్రాంతానికి చెందిన వడ్డాది సత్య నరసింహమూర్తి(24) మృతదేహాలను బయటకు తీశారు. ఆదివారం మధ్యాహ్నం ఆరుగురు యువకులు కారులో సరియా జలపాతాన్ని సందర్శించేందుకు వచ్చారు. అయితే వీరిలో వాసు,నరసింహమూర్తి జలపాతంలో స్నానం చేస్తున్న సమయంలో దిగువున ఉన్న సేలయేరులోకి జారి పడి గల్లంతయ్యారు.ఈ సంఘటనపై అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.యువకుల మృతదేహాలను శవ పరీక్షకు కేజీహెచ్‌కు పంపారు.

పుష్పయాగానికి పూలు తరలింపు

ఎంవీపీ కాలనీ: ఒంటిమెట్ట శ్రీ కోదండరామ స్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్యాత్మికవేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలను సోమవారం ఎంవీపీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. ఈ పూలకు సంకల్పం చేసి అనంతరం ఒంటిమెట్టకు తరలించినట్లు ప్రసాద్ తెలిపారు.

అట్టహాసంగా అగ్నిమాపక వారోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌ఓ రేణుకయ్య

అల్లిపురం: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన ఆయన, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేణుకయ్య మాట్లాడుతూ, వారోత్సవాల్లో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక శకటాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డాబాగార్డెన్స్, అంబేడ్కర్ సర్కిల్, సంగం శరత్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట, సౌత్ జైలురోడ్డు, జగదాంబ, టర్నల్ చౌల్ట్రీ మీదుగా సూర్యాబాగ్‌కు ర్యాలీ చేరుకుంది. వారోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ పి.సింహాచలం, అగ్నిమాపక సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెళ్లొస్తాం.. పెరిగి మళ్లొస్తాం..




సముద్రంలో విడిచిపెట్టడానికి తీసుకువెళుతూ...

ఏయూక్యాంపస్ : విశాఖ సాగర తీరం.. అద్భుతమైన జీవవైవిధ్య ఘట్టానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఇక్కడి పుడమి తల్లి ఒడిలోనే అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు జీవం పోసుకుని, ఆపై సముద్రంలో జీవనాన్ని కొనసాగిస్తాయి. వేల మైళ్లు ప్రయాణించి.. తిరిగి తాము పుట్టిన గడ్డకే వస్తాయి. తమ తర్వాతి తరానికి జీవం పోస్తాయి. మళ్లీ అనంత సాగరంలోకి సాగిపోయే ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రస్థానం ప్రకృతిలోని ఓ అద్భుతం. అయితే ఈ ప్రయాణం పూలపాన్పు కాదు. గుడ్డు దశ నుంచి సముద్రంలో జీవనం సాగించే వరకు ప్రతి అడుగులోనూ వాటికి సవాళ్లు ఎదురవుతాయి. కాగా.. ఈ ఏడాది వందలాది తాబేళ్లు విశాఖ తీరంలో గుడ్లు పెడుతుండగా.. అటవీ శాఖ వాటిని సేకరించి సంరక్షిస్తోంది. పొదిగిన పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి విడుదల చేస్తోంది.

సాగరంలోకి పయనం


ఈదుతూ ముందుకు వెళుతున్న తాబేలు పిల్లలు

ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెట్టిన గుడ్లు పొదగడానికి 45 రోజుల పడుతుంది. ఈ కీలకమైన సమయంలో వాటి సంరక్షణ చాలా ముఖ్యం. తీర ప్రాంతాల్లో సంచరించే కుక్కల నుంచి ఈ గుడ్లకు ముప్పు ఉంటుంది. ఈ సమయంలో అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గుడ్లు పెట్టే కాలంలో, అటవీశాఖ సిబ్బంది ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల వరకు తీరం వెంబడి గస్తీ నిర్వహిస్తారు. వారు తాబేళ్లు గుడ్లు పెట్టిన ప్రదేశాలను గుర్తించి, వెంటనే ఆ గుడ్లను సేకరిస్తారు. అనంతరం, వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ దాదాపు అడుగున్నర లోతులో గుడ్లను పాతిపెట్టి, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తారు. కుక్కలు, ఇతర జంతువులు, మనుషుల నుంచి రక్షణ కల్పిస్తారు. సుమారు 45 రోజుల తర్వాత ఈ గుడ్ల నుంచి చిట్టి తాబేళ్లు బయటకు వస్తాయి. ఇలా వచ్చిన వందలాది తాబేలు పిల్లలను అటవీశాఖ సిబ్బంది ప్రతి రోజూ ఎంతో జాగ్రత్తగా సముద్రంలోకి వదులుతున్నారు. ఇటీవల పాండురంగాపురం వద్ద బీచ్‌లో 170 తాబేలు పిల్లలను ఇలాగే సముద్రంలోకి విడిచిపెట్టారు.

జీవితం ఓ పోరాటం

గుడ్డు దశలో ఉన్న ముప్పు తొలగిపోయినా.. సముద్రంలోకి చేరిన తర్వాత కూడా ఈ తాబేలు పిల్లల జీవనం సవాళ్లతో కూడుకున్నదే. ఆహారం సంపాదించుకోవడం, ఇతర సముద్ర జీవుల నుంచి తమను తాము రక్షించుకోవడం పెద్ద సవాలుగా మారుతుంది. పుట్టిన వాటిలో చాలా తక్కువ సంఖ్య మాత్రమే అన్ని అడ్డంకులను అధిగమించి పెద్దవై.. మళ్లీ గుడ్లు పెట్టడానికి ఎక్కడ పుట్టాయో అక్కడి తీరానికి తిరిగి వస్తాయి. పెద్దయ్యాక కూడా.. తీరానికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు మత్స్యకారుల వలలకు చిక్కి, పడవలకు తగిలి కొన్ని తాబేళ్ల ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి.. తాబేళ్లు వలల్లో చిక్కుకున్నా సురక్షితంగా బయటపడేలా సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్‌ఆర్‌ఐ) ప్రత్యేకమైన వలలను రూపొందించింది. వీటి వినియోగం పూర్తిస్థాయిలో అమలైతే.. ఈ అరుదైన జీవుల సంరక్షణ పూర్తిస్థాయిలో సాధ్యపడుతుంది.

రాత్రి వేళ రహస్యంగా..


ఆలివ్ రిడ్లే జాతికి చెందిన సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్య తీరానికి చేరుకుంటాయి. తమ ముందు, వెనుక కాళ్లను ఉపయోగించి ఇసుకలో గుంతలు తవ్వి.. అందులో గుడ్లు పెడతాయి. ఒక్కో ఆడ తాబేలు సుమారు 60 నుంచి 120 గుడ్ల వరకు పెట్టి.. ఆ గుంతలను ఇసుకతో పూడ్చేస్తాయి. ఆ తర్వాత సూర్యోదయం కాకముందే అవి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ తాబేళ్లు చంద్రుడి కదలికను అనుసరించి సముద్ర తీరానికి వస్తాయి. సూర్యోదయం కాకముందే ఎవరి కంటా పడకుండా తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతాయి.

కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి బ్లాస్ట్‌ఫర్నేస్ సందర్శన


బ్లాస్ట్‌ఫర్నేస్‌లో అధికారులు, కార్మికులతో కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి సంజయ్ రాయ్

ఉక్కునగరం : కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్ సోమవారం బ్లాస్ట్‌ఫర్నేస్–1ను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనలో భాగంగా వచ్చిన ఆయనకు విభాగం ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన బీఎఫ్–1లో జరుగుతున్న ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. విభాగంలో సాధిస్తున్న విజయాలను అధికారులు, విభాగం కార్మికులు ఆయనకు వివరించారు. కార్మిక నాయకులు బాబా (ఏఐటీయూసీ), పోలీసు నాయుడు (ఐఎన్‌టీయూసీ), కోటేశ్వరరావు, అలమండ శ్రీనివాసరావులు కార్మికుల సమస్యలను వివరించారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఉత్పత్తిపై దృష్టి సారించాలని, తద్వారా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. పర్యటనలో ఆయనతో పాటు డైరెక్టర్లు సలీం వి పురుషోత్తమన్, గణేష్, జి.వి.ఎస్.ప్రసాద్ ఉన్నారు.

జీవీఎంసీ వాహనం ఢీకొని మహిళ మృతి


మృతురాలు లావణ్య

అల్లిపురం: జీవీఎంసీ గార్బేజ్ లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంచరపాలేనికి చెందిన లావణ్య ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర గల కంకటాల టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తోంది. ఆమె విధులు ముగించుకుని తన తోటి ఉద్యోగి ఎల్లాజీ ద్విచక్రవాహనంపై జైలురోడ్డు నుంచి జగదాంబ జంక్షన్‌కు బస్సు కోసం వెళ్తుండగా, ఆ సమయంలో అటు నుంచి వస్తున్న జీవీఎంసీ గార్బేజ్ లారీ వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న లావణ్య కుడివైపు పడిపోవడంతో ఆమె తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎల్లాజీ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రైవేట్ ఆస్పత్రికి ఇద్దరి తరలింపు

- కేజీహెచ్‌లో నలుగురికి వైద్య సేవలు
- నర్సీపట్నంలో కోలుకుంటున్న ఇద్దరు


కోలుకుంటున్న క్షతగాత్రుడు సూరిబాబు

మహారాణిపేట /నర్సీపట్నం: కైలాసపట్నం ప్రమాదంలో గాయాలైన నలుగురు క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న ఫైర్ వర్క్స్ మేనేజర్ మడగల జానకీరాం, సియ్యాద్రి గోవిందలను మెరుగైన వైద్య కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మొత్తం ఆరుగురు క్షతగాత్రులను తీసుకొని వచ్చి కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చేర్పించారు. తీవ్రంగా గాయపడ్డ జల్లూరి నాగరాజుకు సీఎస్‌ఆర్ బ్లాక్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగరాతి శ్రీను, గుప్పెన సూరిబాబు కోలుకుంటున్నారు.

రైల్వే సిబ్బంది చొరవతో మహిళ సుఖ ప్రసవం


కదులుతున్న రైల్లోనే జైనాబ్‌కు జన్మించిన ఆడబిడ్డ

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్‌లోని కమర్షియల్ కంట్రోల్ సిబ్బంది మానవత్వంతో, సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఘటన ఇది. ఆదివారం రాత్రి చర్లపల్లి నుంచి కిషన్‌గంజ్ వెళ్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ విశాఖలో బయలుదేరిన తర్వాత, సుమారు 11:30 గంటల సమయంలో ఎస్–4 కోచ్‌లో ప్రయాణిస్తున్న కె. జైనాబ్ అనే నిండు గర్భిణికి పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఆమె రైల్లోనే ప్రసవించారు. వెంటనే స్పందించిన కమర్షియల్ సిబ్బంది, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సిబ్బంది సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టారు. కొత్తవలస స్టేషన్‌లో రైలును నిలిపివేసి, తల్లీబిడ్డను అత్యవసరంగా కిందికి దించారు. అనంతరం, వారికి మెరుగైన వైద్య సహాయం అందించేందుకు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ క్లిష్ట సమయంలో రైల్వే అధికారులు చూపిన తక్షణ స్పందనను ప్రయాణికులు, జైనాబ్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించిన రైల్వే సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



ఎంపికైన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రిటర్నింగ్ అధికారి పృథ్వీరాజ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా ఒలింపిక్ సంఘం (వీడీఏవో) నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. ఎన్నికల అధికారి పృథ్వీరాజ్ ఎన్నికల ప్రక్రియను వివరించారు. మార్చి 2న రిజల్యూషన్ ద్వారా రిటర్నింగ్ అధికారిని నియమించామని, ఓటర్ల జాబితా పరిశీలన, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఈ నెల 13న ఎన్నిక నిర్వహించామని తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా హర్షవర్ధన్, కార్యదర్శిగా లలిత్‌కుమార్, కోశాధికారిగా కిషోర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, పది మంది ఈసీ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం పరిశీలకుడు కేపీ రావు మాట్లాడుతూ, ఒక జిల్లా ఒకే సంఘం అనే నినాదంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వచ్చే జూలైలో విశాఖలోనే రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఎన్నికలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో చీఫ్ పాట్రన్ శివశంకర్ పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ వ్యవహారంలో ముగ్గురిపై కేసు

పెందుర్తి: చినముషిడివాడలోని జియోన్ టెక్నాలజీస్‌లో భెల్‌లో సూపర్‌వైజర్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు జరిగిన పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు వ్యవహారంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి సతీష్‌కుమార్ తెలిపారు. జియోన్‌లో పరీక్ష నిర్వాహణ బాధ్యత తీసుకున్న టీసీఎస్ సంస్థ ఫిర్యాదు మేరకు.. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పరీక్షకు హాజరై కాపీయింగ్‌కు పాల్పడిన అభ్యర్థితో పాటు అతడికి సహకారం అందించిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. పై అంశంతో పాటు కేసులో ఇతర కోణాల్లోనూ సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయం నవ సమాజ నిర్మాణం


మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు గ్రంథాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబేడ్కర్ ఆశయం నవ సమాజ నిర్మాణమని ఆయన అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, జిల్లా మహిళా న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి సునంద, న్యాయవాదులు పాకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 18, 19, 22 తేదీల్లో విశాఖపట్నం –అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 16, 19, 20 తేదీల్లో అమృతసర్–విశాఖపట్నం(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, బాలంగీర్, సంబల్‌పూర్, ఝార్సుగుడ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.